నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, సోమవారం 15 ఏప్రిల్ 2024 | KAMAREDDY

నిజామాబాద్, కామారెడ్డిలో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్లు రాజీవ్‌గాంధీ హన్మంతు, జితేశ్ వీ పాటిల్

నేడు బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశాలు



నిజామాబాద్, ఏప్రిల్ 14: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో నేడు(సోమవారం) బీఆర్ఎస్ లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశాలు నిర్వహించనున్నారు. బాన్సువాడలోని మీనా గార్డెన్‌లో ఉదయం 9 గంటలకు, గాంధారిలో 11 గంటలకు, బిచ్కుంద మండల కేంద్రంలో సాయంత్రం 4 గంటలకు సమావేశాలు నిర్వహించనుండగా.. మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, జహీరాబాద్ ఎంపీ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ తోపాటు మాజీ ఎమ్మెల్యేలు హన్మంత్ షిండే, జాజాల సురేందర్ హాజరుకానున్నారు. భీమ్‌గల్ పట్టణంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, నిజామాబాద్ లోక్‌సభ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ పాల్గొననున్నారు. ఈ సమావేశాలకు పార్టీ శ్రేణులు తరలిరావాలని నాయకులు కోరారు.

మారని తీరు!

అస్తవ్యస్తంగా టీయూ పరిపాలన

- గాడితప్పిన పరీక్షల విభాగం
- ఫలితాల వెల్లడిలో అంతులేని జాప్యం
- యూనివర్సిటీపై ఇన్‌చార్జి వీసీ శీతకన్ను
- జవాబు పత్రాల భద్రతపై అనుమానాలు

నిజామాబాద్, ఏప్రిల్ 14(నమస్తే తెలంగాణ ప్రతినిధి): తెలంగాణ యూనివర్సిటీలో రెగ్యులర్ వైస్ చాన్స్‌లర్‌గా ఉన్న రవీందర్ గుప్తా జైలుకు వెళ్లగా అప్పట్లో చోటుచేసుకున్న గందరగోళానికి కాసింత ఫుల్‌స్టాప్ పడినట్లయ్యింది. తీవ్ర అవినీతి, అక్రమాలకు కేరాఫ్‌గా నడిచిన విశ్వవిద్యాలయంలో లంచాలు బహిరంగంగానే కొనసాగగా డబ్బులు పుచ్చుకుంటూ వీసీ అడ్డంగా ఏసీబీకి చిక్కి పదవీచ్యుతుడు అయ్యాడు. తదనంతరం ఇన్‌చార్జి వీసీగా సీనియర్ ఐఏఎస్‌లు కొనసాగుతున్నప్పటికీ టీయూలో మార్పు అన్నది మచ్చుకూ కనిపించడం లేదు. ఇన్‌చార్జి వీసీగా కొన్నాళ్లపాటు వాకాటి కరుణ కొనసాగారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రస్తుతం బుర్రా వెంకటేశం ఈ బాధ్యతలను చేపట్టారు. సీనియర్ ఐఏఎస్ సారథ్యంలోనే టీయూ పరిపాలన పేరుకే నడుస్తున్నది. అంతా రిజిస్ట్రార్ కనుసన్నల్లోనే , ఆయన చెప్పిందే వేదం అన్నచందంగా మారింది. అన్నీ తెలిసి ప్రస్తుత రిజిస్ట్రార్ కూడా తప్పులు చేయడం, గత పాలకవర్గం చేసిన తీర్మానాలను అమలు చేయకపోవడం, పరిపాలనను గాడిలో పెట్టాల్సింది పోయి అస్తవ్యస్తంగా మార్చడం వంటి వ్యవహారాలతో మరోసారి తెలంగాణ విశ్వవిద్యాలయం వివాదాస్పదమవుతున్నది. ముఖ్యంగా పీజీ, యూజీ కోర్సుల్లో విద్యనభ్యసించే వేలాది మంది విద్యార్థులకు కీలకమైన జవాబుపత్రాల వ్యవహారంలో చోటు చేసుకుంటున్న నిర్లక్ష్యంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతున్నది.

మూల్యాంకనం అస్తవ్యస్తం...

పాత వీసీ హయాంలో టీయూ పరీక్షల విభాగం భ్రష్టు పట్టింది. పైసలిచ్చినోళ్లకు ఏ పనంటే అది చేసిపెట్టడం ఇక్కడ రివాజుగా మారినట్లు ఆరోపణలున్నాయి. యూనివర్సిటీ అందించే వివిధ కోర్సుల జవాబు పత్రాల మూల్యాంకనం గతంలో ఆఫ్‌లైన్‌లో జరిగేది. వివాదాస్పద వీసీగా ముద్రపడిన రవీందర్ గుప్తా ఏకంగా ఆన్‌లైన్ పేరిట ఓ సంస్థకు నిబంధనలకు విరుద్ధంగా మూల్యాంకనాన్ని అప్పగించారు. ఊరూ పేరూ లేని సంస్థకు కీలకమైన పనులను కట్టబెట్టడంతో ఇప్పుడు జవాబు పత్రాల విశ్లేషణ, మార్కుల సంగ్రహణ అన్నది అస్తవ్యస్తంగా మారింది. జవాబుపత్రాలను స్కాన్ చేసి ఆన్‌లైన్ ద్వారా మూల్యాంకనం చేస్తే వేగంగా, తక్కువ కాలంలోనే ఫలితాలు వెల్లడి కావాలి. ఇదే ఉద్దేశంతో ఆన్‌లైన్ పేరిట ఒక సంస్థకు టీయూ నుంచి రూ.50లక్షలకు పైగా నిధుల కేటాయింపులు జరుగుతున్నది. ఇక బ్యాక్‌లాగ్ అభ్యర్థులు పెరిగితే చెల్లింపులు మరింత పెరిగేలా కాంట్రాక్ట్ జరిగింది. కానీ మూడేండ్లలో సరైన సమయానికి ఫలితాలు వెల్లడి కాలేదు. 45రోజుల్లో రావాల్సిన ఫలితాలు ఏకంగా మూడు నెలలకు వెల్లడించిన దాఖలాలున్నాయి. దీంతో ప్రస్తుతం ఒక ఏడాది గ్యాప్ ఏర్పడినట్లుగా విద్యార్థులు, యూనివర్సిటీ వర్గాలు చెబుతున్నాయి. గజిబిజి గందరగోళాన్ని సరిదిద్దేందుకు రిజిస్ట్రార్‌గా యాదరిగికి బాధ్యతలిస్తే ఆయన కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించడం, పాత వ్యవస్థను మార్చకపోవడంపై అనేక మంది లోనూ అసంతృప్తి వ్యక్తమవుతున్నది. టీయూను కాపాడతారని విద్యార్థి సంఘాలు, అధ్యాపకులు, స్వచ్ఛంద సంస్థలు, పాలకవర్గం ఎంతగానో ఆశపడగా అదంతా అడియాశగానే మిగిలినట్లయ్యింది.

కొత్త టెండర్లు పిలుస్తాం..

> జవాబు పత్రాల మూల్యాంకన బాధ్యతలను ఇతర సంస్థలకు అప్పగించాలని గతంలో నిర్ణయం జరిగింది వాస్తవమే. త్వరలోనే కొత్త సంస్థకు బాధ్యతలు అప్పగిస్తాం. ఇందుకోసం నోట్ ఫైల్ రెడీ చేశాం. టెండర్లు పిలిచి అర్హత కలిగిన సంస్థకు ఈ బాధ్యతలను కట్టబెట్టడం జరుగుతుంది.
>
> **- ప్రొ.యాదగిరి, రిజిస్ట్రార్, తెలంగాణ యూనివర్సిటీ**

జవాబు పత్రాలకు భద్రతేది?

మూల్యాంకనం పూర్తయ్యే వరకు, ఆ తర్వాత మూడేండ్ల వరకు విద్యార్థులకు సంబంధించిన జవాబు పత్రాలు అత్యంత భద్రంగా చూసుకోవాల్సిన బాధ్యత తెలంగాణ యూనివర్సిటిదే. పరీక్షల గది నుంచి నేరుగా పరీక్షల విభాగానికి తెప్పించి భద్రపరిచిన తర్వాత అక్కడే మూల్యాంకనాన్ని చేయించాలి. ఆ జవాబు పత్రాలను స్టోర్‌లో పెట్టి రక్షించాలి. కానిక్కడ అందుకు విరుద్ధంగా వ్యవహారం నడుస్తుందన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ప్రైవేటు వాహనాల్లో, ఎలాంటి భద్రత లేకుండా జవాబు పత్రాలను హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లుగా తెలుస్తోంది. మార్గమధ్యంలో జవాబుపత్రాలకు రక్షణ కరువవ్వగా ఏమైనా జరిగితే బాధ్యత వహించేదెవ్వరు? అన్నది దేవుడికే వదిలేశారు. ఈ లోపాలను దృష్టిలో పెట్టుకొని గతేడాది ఏప్రిల్‌లో జరిగిన పాలకమండలి సైతం సీరియస్‌గా విచారణ జరిపి చర్యలకు నిర్ణయం తీసుకున్నది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కూడా ఈ వ్యవహారంపై దర్యాప్తు చేశారు. వివాదాస్పద నిర్ణయాన్ని రద్దు చేసి విద్యార్థులకు ఆమోదయోగ్యమైన నిర్ణయాన్ని తీసుకోవాలని సూచనలు చేసింది. కానీ పాత వీసీ రవీందర్ గుప్తా హయాంలో దుమారం రేపిన ఆన్‌లైన్ సంస్థకే మూల్యాంకనాన్ని కొనసాగిస్తుండడం ముక్కున వేలేసుకునేలా చేస్తున్నది. పైగా జవాబు పత్రానికి రూపాయి చొప్పున తగ్గించి ఏడాది కాలానికి సేవలు పొడిగించడం విడ్డూరమని, దీని వెనుక దాగి ఉన్న రహస్యాలపై విచారణ చేసి బయట పెట్టాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

గోల్‌మాల్.. గందరగోళం...

వీసీ రవీందర్ గుప్తా కొనుగోళ్లలో గోల్‌మాల్ చేశారు. నిధులు దుర్వినియోగం చేసి యూనివర్సిటీ పరువును బజారున పెట్టారు. రిజిస్ట్రార్లను ఇష్టారాజ్యంగా మార్చి తనకు నచ్చినట్లుగా వ్యవహరించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని గత ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతోపాటు పాలకమండలి దిశానిర్దేశంలో రిజిస్ట్రార్ ద్వారా పరిపాలనను నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకోసం సీనియర్ ఐఏఎస్‌ను ఇన్‌చార్జి వీసీగా నియమించారు. కానిప్పుడు పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడ్డట్లు అన్న చందంగా మారిందని గుసగుసలు వినిపిస్తున్నాయి. నాటి వీసీ రవీందర్ గుప్తా ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాలు చెల్లవని 2023, ఏప్రిల్‌లో జరిగిన పాలక మండలి సమావేశం స్పష్టంగా నిర్ణయం తీసుకున్నది. అప్పటికే కుదుర్చుకున్న నిర్ణయాలను రద్దుచేసి అవసరాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించింది. అయితే శాశ్వత వీసీ లేకపోవడంతోపాటు ఇన్‌చార్జి వీసీ మారడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. కొత్త ప్రభుత్వ కార్యకలాపాల్లో బుర్రా వెంకటేశం బిజీగా ఉండడంతో యూనివర్సిటీని రిజిస్ట్రార్‌కే అప్పగించారు. చుట్టపు చూపునకు మాత్రమే ఇటువైపు వచ్చినప్పటికీ లోతైన సమీక్ష చేయకపోవడంతో ఇన్‌చార్జి వీసీకి పూర్తిస్థాయిలో టీయూపై అవగాహన లేకుండా పోయింది. దీంతో ప్రస్తుతం కీలక పదవుల్లో కొనసాగుతున్న వారికి ఇష్టారాజ్యంగా పనిచేసేందుకు రాచబాట ఏర్పడినట్లు అయ్యింది. విద్యార్థుల భవిష్యత్తు, యూనివర్సిటీ పేరును నిలపాల్సిన వ్యక్తులు స్వార్థాన్ని వదిలి పనిచేయాల్సి ఉండగా కొద్ది రోజులకే తీరు మార్చుకుని యథాలాపంగా వక్రమార్గాన్ని అవలంబించడం ద్వారా పరిస్థితిలో ఎంతకూ మార్పు రావడం లేదు.

రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి

ఉమ్మడి జిల్లాలో అంబేద్కర్ జయంతి వేడుకలు

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను ఉమ్మడి జిల్లాలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషిచేయాలి

బాన్సువాడలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ, ఏప్రిల్ 14: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. అంబేద్కర్ జయంతి అన్ని వర్గాల వారికి పండుగ అని, ఏదో కులానికి, వర్గానికే కాదని పేర్కొన్నారు. బాన్సువాడ పట్టణంలో నిర్వహించిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అంబేద్కర్ చౌరస్తాలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ.. దేశానికి వన్నె తెచ్చిన గొప్పవ్యక్తి బీఆర్ అంబేద్కర్ అని అన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారమే పాలన కొనసాగుతుందన్నారు. ఆయన స్ఫూర్తితో కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటం చేశారని పోచారం గుర్తుచేశారు.

అంబేద్కర్ అందరివాడు..

వేల్పూర్‌లో అంబేద్కర్ విగ్రహానికి నమస్కరిస్తున్న మాజీ మంత్రి వేముల

-మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్, ఏప్రిల్ 14 : అంబేద్కర్ కొందరువాడు కాదని, అందరివాడని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని సమాజంలోని పీడిత, బడుగు బలహీన వర్గాలు ప్రజల అభ్యున్నతి కోసం రచించారని పేర్కొన్నారు. వేల్పూర్ మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. రాజ్యాంగం పీడిత, బడుగు, బలహీన వర్గాలు ప్రజలకు ఒక శ్వాస, ఊపిరిలాంటిదని అన్నారు. ఆయన చూపు ఎప్పుడు వీరివైపే ఉండేదన్నారు. రాజ్యాంగం మనకు కల్పించిన హక్కులను కాపాడుకోవాలంటే చదువే బలహీనుల ఆయుధం కావాలని అంబేద్కర్ అన్నారని తెలిపారు. ఆస్తులు, కష్టాలు, సంతోషాలు వస్తాయి పోతాయని కానీ సంపాదించిన జ్ఞానం ఎన్నటికీ పోదన్నారు. పిల్లలు చదివేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. అంబేద్కర్ స్ఫూర్తితోనే కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు రాష్ట్రంలో వెయ్యికి పైగా గురుకులాలను ఏర్పాటు చేశారని తెలిపారు. అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకుని ప్రతిఒక్కరూ చదువుకోవాలన్నారు. రాజ్యాంగంలో పొందుపర్చబడిన ఆర్టికల్ 3 ద్వారానే రాష్ట్రం ఏర్పడిందని కేసీఆర్ ఎప్పుడూ అంటారని, అందుకే హైదరాబాద్ నడిబొడ్డున నిర్మించిన సెక్రటేరియట్‌కు డాక్టర్ బీఆర్.అంబేద్కర్ పేరు పెట్టారని వివరించారు. 125 అడుగుల ఎత్తైన అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని కూడా సాగరతీరాన ఏర్పాటు చేశారని తెలిపారు.

యాడారంలో తాగునీటి కష్టాలు

ఖాళీ బిందెలతో మహిళల ధర్నా

బీబీపేట మండలం యాడారం గ్రామానికి చెందిన మహిళలు తాగునీటి కోసం రోడ్డెక్కారు. తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ గ్రామంలోని బస్‌స్టాప్ వద్ద ఆదివారం మహిళలు ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని ఆరో వార్డులో నీటి సమస్య ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీటి సమస్యను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

-బీబీపేట్, ఏప్రిల్ 14

కానరాని టెంట్లు..చెట్ల కిందే రైతులు



నిజామాబాద్ జిల్లా నవీపేట మండలంలోని జన్నెపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. కేంద్రంలో సరైన సౌకర్యాలు కల్పించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వేసవికాలం కావడంతో కనీసం టెంటు, నీటి సౌకర్యం కల్పించకపోవడంతో రైతులు చెట్ల కిందే సేద తీరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

-స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

'ఆరు గ్యారెంటీ'లతో వంచించిన కాంగ్రెస్

- ఇప్పటి వరకు ఏ ఒక్క హామీ అమలుచేయలేదు
- రాష్ట్రంలో మొదలైన కరెంట్ కష్టాలు
- లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్
- జక్రాన్‌పల్లిలో ఎన్నికల సన్నాహక సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

ఇందల్వాయి, ఏప్రిల్ 14 : ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని నిజామాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. ఆదివారం జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించగా.. ఎమ్మెల్సీ వీజీ గౌడ్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పేరు మీద 420 హామీలు ఇచ్చి నెరవేర్చకుండా మోసం చేసిందని మండిపడ్డారు. పేదలకు కల్యాణలక్ష్మి కింద రూ.లక్షతోపాటు తులం బంగారం ఇప్పటి వరకు ఎందరికి ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి, మహిళలకు పెన్షన్, రైతులకు రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి స్పందన కరువైందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఒక్కసారి కూడా కరెంట్ పోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి గ్రామాల్లో తరచూ కరెంట్ పోతుందని రైతులు తన దృష్టికి తీసుకవచ్చినట్లు బాజిరెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ఎన్ని రోజులు పరిపాలిస్తుందో ఆ పార్టీ నాయకులకే తెలియదన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు అధైర్యపడొద్దని, పార్టీ కోసం పని చేసిన వారికి గుర్తింపు ఉంటుందని అన్నారు. పార్టీ నుంచి వెళ్లిన వారి గురించి ఆలోచించకుండా గెలుపు కోసమే ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు 24 గంటల కరెంట్, ఇచ్చిన హామీలను నెరవేర్చిందన్నారు. తనకు మండలం నుంచి అత్యధిక మెజార్టీ ఓట్లు రావాలని ఆకాంక్షించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులే తన గెలుపునకు పునాదులవుతాయని తెలిపారు. తనను ఆశీర్వదిస్తే ఢిల్లీలో తెలంగాణపై మాట్లాడే అవకాశం ఉంటుందని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని సూచించారు. మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్ మాట్లాడుతూ కార్యకర్తలు అధైర్యపడకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తే తప్పక విజయం సాధిస్తామన్నారు. సమావేశంలో ఎంపీపీ కుంచాల విమల రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

-రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ఇందల్వాయి, ఏప్రిల్ 14: రైతులు తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సూచించారు. ఆదివారం ఆయన మండలంలోని గన్నారం కమాన్ వద్ద ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.రైతులు దళారులను నమ్మి మోసపోకూడదన్నారు. ఇప్పటివరకు వరి ధాన్యం ఎంత కొనుగోలు చేశారని నిర్వాహకులను అడిగి తెలుసుకొన్నారు. ఎమ్మెల్యే వెంట నాయకులు చింతలపల్లి గోవర్ధన్‌రెడ్డి, నవీన్‌గౌడ్, ఇమ్మడి గోపి, కోరట్‌పల్లి ఆనంద్, చిన్నముత్తెన్న తదితరులు ఉన్నారు.